# సంస్కారం

- సి.ఎన్.చంద్రశేఖర్

ఆదివారం అయినా సిటీబస్ రష్‌గా వుంది. తన ప్రక్క సీటు ఖాళీగా ఉండడంతో ప్రక్కనే నిలుచుని వున్న వ్యక్తితో "కూర్చోండి అంకుల్" అంది.

అది ఆడవాళ్ళ సీటు కాబట్టి ఖాళీగా ఉన్నా అందులో కూర్చోలేదు అతను. అయితే ఆ అమ్మాయే ఆఫర్ చేయడంతో ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

"నీ పేరేమిటమ్మా?"

"సౌజన్య!"

'చక్కటి పేరు. ఆదివారం ఎక్కడికి బయలుదేరావు? సినిమాకా, షాపింగ్‌కా?"

"కాలేజీలో స్పెషల్ క్లాసు ఉందంకుల్" అంది సౌజన్య.

"మంచి పిల్ల" ఆమె తలపై చేయి వేసి నిమురుతూ అన్నాడు.

అతను అలా చేయడం ఆమెకు ఎబ్బెట్టుగా అనిపించింది. అతని వయసు బహుశా నలభై ఏళ్ళుంటాయేమో. తనేదో చాలా పెద్దవాడయిపోయినట్టు ప్రవర్తించడం ఆమెకు నచ్చలేదు.

కోఠీలో చాలామంది దిగిపోవడంతో బస్సు దాదాపు ఖాళీ అయిపోయింది. అప్పట్నుంచీ అతను మరీ వెకిలిగా ప్రవర్తించసాగాడు. అతనికి సీటు ఆఫర్ చేసి అనవసరంగా ఇబ్బందిని తెచ్చుకున్నందుకు బాధపడసాగింది.



లేచి వేరే సీట్లో కూర్చుందామా అనుకుంది. మళ్ళీ బస్సులోని వాళ్ళకు అనుమానం వస్తుందని ఆ ఆలోచన మానుకుంది. ఆమెకు తన స్నేహితురాలు జ్యోతి చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి.

"ఈమధ్య మా ఏరియాలో మధ్య వయసు మగవాళ్ళతో ఇబ్బంది ఎక్కువగా ఉంది. టీనేజ్ అమ్మాయిల్తో అవసరం ఉన్నా లేకపోయినా మాట్లాడటం, ఏదో ఒక సాకుతో తాకడం వాళ్ళకు అలవాటయిపోయింది. వయసులో కాస్త పెద్దవాళ్ళు కాబట్టి వాళ్ళ గురించి చెడుగా ఎవరూ అనుకోరు. అది అడ్వాంటేజ్‌గా తీసుకుని సంస్కారరహితంగా ప్రవర్తిస్తున్నారు. బస్సు ఎక్కాలన్నా, సినిమాకు వెళ్లాలన్నా భయమేస్తోంది. ఇంకా టీనేజ్ కుర్రాళ్ళే నయం. సభ్యతగా ప్రవర్తించడం, సరిగ్గా గైడ్ చేయడం, అవసరమైతే సహాయం చేయడం చేస్తుంటారు."

'జ్యోతి చెప్పింది నిజమే' అనుకుంది సౌజన్య. బస్సు తను దిగవలసిన స్టేజిలో ఆగగానే గబగబా దిగేసింది. అక్కడ్నుంచి వడివడిగా తన కాలేజీవైపు అడుగులు వేయసాగింది.

క్లాసు అయిపోయాక బస్సులో తనకు కలిగిన ఇబ్బంది గురించి జ్యోతితో చెప్పింది సౌజన్య.

"చెప్పు తీసుకుని కొట్టలేకపోయావా రాస్కెల్ని. మనం భయపడుతూ కూర్చున్నంతకాలం వాళ్ళు అలా ప్రవర్తిస్తూనే వుంటారు" ఆవేశంగా అంది జ్యోతి.

"నీలాంటి వాళ్ళు ఒకరైనా తోడుగా వుండి ఉంటే ఆ పని చేసేదాన్ని. వాడ్ని తలచుకొంటుంటేనే ఒళ్ళంతా తేళ్ళూ, జెర్రెలూ పాకినట్లుంది నాకు. పైగా పురుషుల్లోకెల్లా తానే ఉత్తముడని తన చేతిపై పురుషోత్తమ్ అని పచ్చబొట్టు కూడా పొడిపించుకున్నాడు."

"పురుషోత్తమా? ఎక్కడ ఎక్కారు బస్సు ఆయన?"

"మలక్‌పేటలో అనుకుంటాను."

★★★

ఆ రోజు రాత్రి తండ్రితో సౌజన్య విషయం చెప్పింది జ్యోతి.

"మలక్‌పేటలో ఎక్కాడట. సీటు ఖాళీగా ఉంది కదా అని కూర్చోబెడితే పిచ్చి పిచ్చి వేషాలు వేసాడట. ఆ రాస్కెల్‌ని షర్టు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించాల్సింది. సౌజన్య పిరికిది కాబట్టి వదిలేసింది. అంత వయసున్న మనిషికి అంత చిన్న బుద్ధులు ఎందుకిచ్చాడో ఆ దేవుడు. ఐ హేట్ హిమ్ లైక్ ఎనీ థింగ్" అంది ఆవేశంగా. నోట మాట రానట్టు నిలబడిపోయాడు పురుషోత్తమ్. 'జ్యోతి తిట్లన్నీ తనకే చెందుతాయి. అయితే ఆ అమ్మాయి జ్యోతి స్నేహితురాలా? తను ఎంత పని చేసాడు? రేపు ఆ అమ్మాయి తనింటికొచ్చి తనని చూచి ఆ రాస్కెల్ తనేనని జ్యోతికి చెబితే ఎంత అసహ్యంగా వుంటుంది? జ్యోతి తనను ఎంత చీదరించుకుంటుంది? తను ప్రాణంలా చూచుకునే కూతురి తిరస్కారాన్ని భరించగలడా? ఇకపై ఇలాంటి తప్పులు మళ్ళీ చేయకూడదు. సంస్కారంతో ప్రవర్తించాలి' అనుకున్నాడు.

తండ్రి తన గదిలోకి వెళ్లాక జ్యోతి కన్నీరు తుడుచుకుంది. సౌజన్యతో వెకిలిగా ప్రవర్తించింది తన తండ్రే అని ఆమెకు తెలుసు. చేతిపై పురుషోత్తమ్ అని పచ్చబొట్టు పొడిపించుకున్న వ్యక్తి అని సౌజన్య చెప్పగానే అతనిని వర్ణించమని చెప్పి తన అనుమానం కన్ఫర్మ్ చేసుకుంది. తనకు ఆ వ్యక్తి ఎవరో తెలుసునని తండ్రికి తెలిస్తే బాధపడతాడు. తనతో ఇదివరకులా ఉండడు. అయితే తండ్రిలో మార్పు తేవడం కోసం, సౌజన్యలా మరో ఆడపిల్ల బాధపడకూడదని కన్నతండ్రి అని కూడా చూడకుండా తీవ్ర పదజాలంతో తిట్టింది. 'భగవంతుడా! నేను చేసింది తప్పే అయితే నన్ను క్షమించు తండ్రీ' అని దేవుడ్ని వేడుకుంది.

★